

# రిపోర్ట్

ఫిజిషన్ యొక్క కన్సల్టేషన్ రూమ్‌లో వున్నవాళ్లు ఫీజు చెల్లించి ప్రిస్క్రిప్షన్ అందుకుని వెళ్లిపోయారు. విజిటర్స్ రూమ్‌లో వున్న అసిస్టెంట్ వరుసక్రమంలో కూర్చుని వున్న మొదటి పేషంటుని లెమ్మని సంజ్ఞ చేశాడు పేషంటు నిలబడ్డాడు.

''రిపోర్ట్ తెచ్చారా? లాబ్ కెళ్లి వచ్చారా?'' అని ఫార్మల్‌గా అడిగాడు పేషంటుని. వాడు తలూపగానే కన్సల్టేషన్ రూమ్‌లోకి పోనిచ్చాడు అసిస్టెంటు. వాకిలికి రెపరెపలాడుతున్న తెర పక్కకి లాగి పట్టుకుని పేషంటు లోపలికెళ్లగానే వదిలేశాడు. తన కుర్చీలో కూచుని యెదురుగా బల్లమీదున్న దినపత్రిక అందుకున్నాడసిస్టెంటు.

ఫిజిషన్ చంద్రమౌళి, ''అలా కూచోండి కుర్చీలో. యేదీ రిపోర్టు?'' అని చెయ్యిజాపాడు. పేషంటు అందించిన రిపోర్ట్లు అందుకుని పరిశీలించాడు ఫిజిషన్.

''బ్లడ్ టెస్ట్ వల్ల తేలిందేమనగా యీ రోగి మందు గోదారిలాగ, డబ్బు మంచి నీళ్ల లాగా వాడి ఆదుకుంటాడు. తరవాత తానాదుకున్న వారినుండి యేదో ఆశించును. బ్రెయిన్ టెస్ట్ చేయగా అజ్ఞానమని తేలింది. గుండె టెస్టు చేయగా హర్ట్ అగునని తేలెను. శరీరమన్న తరవాత వీక్ పాయింట్ వుంటుందని, ఎకిలీస్‌హీల్‌లాగానన్నమాట, టెస్ట్ చేయగా వుపకారం చేయకుండా వుండలేడని. అదీ వీక్ పాయింట్. మనస్సు టెస్ట్ చేయగా లిబరలే గాక, మెడిల్‌సమ్మని గూడా తేలింది.

బుద్ధిని టెస్టు చేయగా, తనమానాన తనుండలేక తోటి మానవుని కష్టం చూడలేక, ఆ కష్టం తొలగించాలని పట్టుదల వున్నదని తేలింది.

అంతరాత్మను టెస్టు చేయగా, అంతరాత్మ ఘోష ఆ జీవుడు వినడనీ, తనను తిట్టి నోరు మూయిస్తాడనీ అంతరాత్మ తేల్చింది.

జీవాత్మను టెస్ట్ చేయగా, ఇగో, పక్షపాతం, అసత్యం పల్కటంలో వుత్సుకత దానివల్ల లాభమని నమ్మట, యెదుటి జీవుని హర్ట్ చేసేందుకు సత్యం పల్కటం జీవుని తత్త్వమని తేలెను. స్థిరత్వం తక్కువ, ఏకాగ్రత తక్కువ, ఆకతాయితనంలో యింటరెస్టున్నది. అని జీవాత్మ తేల్చెను.

ఆరోగ్యం టెస్ట్ చేయగా, ఉక్కు శరీరమనుకొని అన్నీ మేసేస్తుంటే, జబ్బు పడంగానే తెలివినబడి డయట్ అబ్జర్వ్ చేయునని తేలెను.

నడవడి టెస్ట్ చేయగా, ఏకాకితనం ఒంటికాయ సొంటికొమ్ము భరించలేక, చుట్టూ జనులను, వారెట్టివారైనా సరే, పోగుచేయునని తేలెను. అలవాట్లు టెస్టు చేయగా, యితరులలో లోపాలు తెలుసుకొని గేలిచేయటం. అందమైన, డబ్బున్న వుద్యోగిని అయిన, పదవిలో వున్న స్త్రీతో పరిచయం కాగానే పరవశత్త్వం పొందటం. స్నేహశీలి కావటం. అట్టి స్త్రీ తనను అవమానించినప్పుడు ఆ స్త్రీ తత్త్వం తెలిసిరావటం, మనిషి మొహం చూసి, నవ్వు చూసి కళ్లు చూసి, మనిషి తత్త్వం తెలుసుకోలేకపోవటం తేలినై.

ఇంకాయేమైనా టెస్టులు కావాలంటే ఆ రోగిని మా లాబ్‌కి మళ్లా తోలాలి''.

ఫిజిషను చంద్రమౌళి, ఆ రోగికి కావాల్సిన వుపశమన వాక్యాలు పలికి,

క్యూరబల్లేనని ధైర్యం చెప్పి ప్రిస్క్రిప్షన్ వ్రాసి యిచ్చి ఫీజు అందుకున్నాడు.

ఆ పేషంటు బయటికి రాగానే, అసిస్టెంటు వరుసలో ముందున్న మరో పేషంటుని లోపలికి తోలాడు. కర్టెన్ దిద్దాడు.

పేషంటు నిలబడే రిపోర్టు అందించింది. ఆమెను కూచోమని ఫిజిషన్ రిపోర్టు చదవటం మొదలెట్టాడు. ''అన్నకోశం టెస్టు చేయగా, ఆకలి లేకపోయినా, తిండి పుష్టి లేకపోయినా, తిండి యావ జాస్తి అని తేలింది. వేళాపాళా లేకుండా చిరుతిండీ, అది అరక్కముందే కాఫీ మొదలైన పానీయాలు పొట్టలో పోసి పొట్ట వూదినట్టు వుబ్బరించగ అపుడు ఆపివేయునని తేలింది.

స్వభావం టెస్టు చేయగా, యెవరికీ వెరవదనీ, అదుపూ ఆజ్ఞా లేవనీ, విరాళింపు, విదిలించి కొట్టం, చేతులు జాడిస్తూ యెగతాళి చేయటంలో బిడియం లేదని తేలింది.

మతి టెస్టు చేయగా పోయిందనీ, వున్న కొంచెం చంచలమనీ, వెర్రి మొర్రి ఆలోచనలు, పగటి కలలూ కంటుందని తేలింది.

బుద్ధి టెస్టు చేయగా లేదని తేలటమే గాక, యెవరిల్లన్నా ఆక్రమించటమిష్టమనీ, యెవరినెత్తినెక్కుదామా అని ఛాన్సు కోసం చూస్తుందని తేలింది.

ఆరోగ్యం టెస్టు చేయగా జన్మతః మంచి బలవంతురాలూ ఆరోగ్యవంతురాలై గూడా, డయట్ పాటించక పోవటం వల్ల, తినగూడని వన్నీ మేసి జబ్బుపడ్డాక డయట్ చూసుకోదని తేలింది.

ఆశయాలు టెస్టు చేయగా, కోరికలు కోటలేలుతుంటే కాళ్లు గడపదాటటం లేదనీ, ఆశఅందల మెక్కుదామంటే, బుద్ధి బురదలోకీడుస్తున్నదనీ తేలింది.

అలవాట్లు టెస్టు చేయగా "బద్ధకము సంజె నిద్దుర । వద్దు సుమా । దద్ది రంబు వచ్చును దానన్ । గద్దింతురింటి వారలు, మొద్దందురు తోడివారు" అనేవి ప్రూవ్ చేస్తుంది.

శుభ్రత టెస్టు చేస్తే తక్కువే. విడిచిన గుడ్డలు వుతుక్కోక వుండలు చేసి విసిరేస్తుంది. గుడ్డలుతుక్కునేవారిని చూసి యెగతాళి చేస్తుంది.

"చాకలి రేవు పెట్టినట్టు అన్ని గుడ్డలుతుక్కోటమేమిటీ? ఆరిన గుడ్డలు బొమ్మపొత్తికలల్లే మడతలు గూడా పెట్టాలా?" అని విరగబడి నవ్వునని తేలింది.

నిద్ర టెస్టు చేస్తే తక్కువే. వెల్లికలా పడుకుని పుస్తకాలు పత్రికలు చదవటం వల్ల, లైటు సరిగాలేక మెదడు దెబ్బ తిన్నది. కూచుని చదవదు."

చాలా దోషాలున్నాయే అని విచారంగా చూసి ప్రిస్క్రిప్షన్ గొలికి రోగికి అందించి, ఫీజు లాక్కుని తోలేశాడు ఫిజిషన్.

మరో పేషంటును కన్సల్టేషన్ రూమ్‌లోకి పంపాడు అసిస్టెంటు.

పేషంటు చెప్పించుకోకుండా తానే హుందాగా కుర్చీలో బైఠాయించాడు.

"రిపోర్టు తెస్తిని. నా వ్యాధి యేమిటో నాకు తెలియును. కాని శాస్త్రీయముగా నయం చేసుకోవాలని మిమ్మల్ని దర్శించితిని. మీరు నయము చేయలేరని తెలిసియు కర్మయందు నమ్మకముగల వాడనై, మీరు చెప్పినట్లు టెస్టులు

చేయుంచుకొని రిపోర్టు తెచ్చితిని'' అని రిపోర్టు అందించాడు.

చంద్రమౌళి ముందు రోగిని చదవటం మొదలెట్టాడు. చిన్న కళ్లు. టపటపా ఆర్పుతున్నాడు. శ్రోత్రియుడని వెల్లడించేదీ, యింకా బ్రహ్మచారేనని తెలియజెప్పేదీ, తెల్లని మూడుపోగుల జంధ్యం, చొక్కా లేదు గనక, పై బట్ట ఫాను గాలికి కదిలినప్పుడల్లా కనిపిస్తున్నది. మొహాన విభూతి రేకలు మూడు. చేతి కర్ర గడ్డం కింద ఆనించి పట్టుకుని చూస్తున్నాడు. ధోవతి బిళ్ల గోచీ పోసి కట్టాడని తెలుస్తున్నది. చెప్పులు లేవు. మనిషి తెలుపు. నల్లని క్రాపు. అపుడు రిపోర్టు చదవసాగాడు చంద్రమౌళి.

ఆలోచనలు టెస్టు చేయగా, తాబట్టిన కుందేటికి మూడే కాళ్లని విశ్వసించునని తేలింది.

ఆశయాలు టెస్టు చేయగా, అమ్మటానికి వీలున్నవన్నీ చాలా తక్కువ ధరకైనా సరే అమ్మివేయునని తేలింది. యేదో వుద్ధరిస్తున్నట్టూ, రక్షణగా వున్నట్టూ మాట్లాడుతూ కూచుని సుష్టుగా భుజించవలెని ఆశయమని తేలింది.

నమ్మకాలు టెస్టుచేయగా, అపర కర్మలలోనూ శాస్త్రంలోనూ వున్న నమ్మకం. బతికివున్నవారికి సాయపడదామని వుండదని తేలింది. గౌరవం, ఆత్మగౌరవం కాపాడుకొనుట యెట్లో బోధించును. కూచుని తినవలెను. పని చేయరాదు. గ్రాంధిక భాషలో దూషిస్తూ వెుుండి సవాధానాలిస్తూ నొప్పించవలెను. డబ్బు మోసం చేసే సంపాదించవలెనని అది ధర్మమేనని వాదించును.

స్త్రీలు శీల సంపద కాపాడుకొనుచూ గొడ్డు చాకిరీ చేస్తూ మగవారిని

గౌరవంగా చూస్తూ పోషించవలెనని అట్లు చేసినచో వారికి మోక్షము కరతలామలకమనీ, జన్మరాహిత్యము పొందెదరనీ బోధిస్తూ క్రియాశీలుడాయెనని తేలెను.

చంద్రమౌళి స్టోన్ ఫేస్ పెట్టి ప్రిస్క్రిప్షన్ వ్రాసి యడమ చేతితో పట్టుకొని, ఫీజు యేదీ అని కుడిచేయి జాపెను.

రోగి కళ్లార్పుతూ సీరియస్‌గా అనెను. ''నీవట్లు ఫీజు తీసికొనరాదు. ఉచితముగానే ప్రిస్క్రిప్షన్ వ్రాసి యిచ్చి మానవత కాపాడుకొనవలెను. అంతేగాక వైద్యుల బంధువులనుండి అసలే ధనము లాగరాదు. వైద్యవిధాన సూత్రములు నాకూ తెలియును'' అన్నాడుగాని లేవనూ లేదు. ప్రిస్క్రిప్షన్ కోసం చెయ్యిజాపనూ లేదు. చొక్కాలేదు గనుక జేబూ లేదు.

''వైద్యబంధువులెవరో చెప్పండి. నాకు తెలుసేమో గుర్తుచేసుకుంటా. లేదా వారి విజిటింగ్ కార్డ్సు చూపినా మంచిదే'' అన్నాడు ఫిజిషన్.

''విజిటింగ్ కార్డ్స్ యెందుకూ? అవసరము లేదు. అందరూ ప్రసిద్ధి కెక్కినవారే. తాతగారు డాక్టరాఫ్ ఫిలాసఫీ. మాతామహుడు యూరిన్ థెరఫీలో దిట్ట ఆయెను. పెత్తండ్రి ప్రకృతి వైద్యము. మాతృమూర్తి డాక్టరాఫ్ ఫాక్సిజమ్. డెలిబరేట్‌గా వైద్యము చేయును. మేనమామ డాక్టరాఫ్ రూథ్‌లెస్‌నెస్'' అని యేకరువు పెడ్తున్నాడు రోగి.

ఇంతలో అసిస్టెంటు గంట మోగించి లేచాడు.

వాకిట్లో కారు హారన్ చంద్రమౌళిని వచ్చేయమని అరుస్తున్నది.

అసిస్టెంటు వాకిలి తెరలాగి చెప్పాడు. ''లంచ్ టైమైంది సార్. తాళం మీరే

వేసుకుంటారా? డ్రైవరుకి కారు తోలుకుపొమ్మని సైగచేసేదా? మోటార్ రన్నవుతున్నది. విజిటింగ్ రూమ్ ఖాళీ. సాయంకాలం అయిదింటికి వస్తామని చెప్పి వెళ్లారు'' అలా అంటూ, తాళం చెవులున్న రింగ్ ఆడించాడు.

''నో. నో'' అని లేచాడు చంద్రమౌళి. ప్రిస్క్రిప్షన్ గాలికి కింద బడింది. ఫాన్ ఆఫ్ అయింది. ఫిజిషన్ వెళ్లి కారులో దూరగానే, కారు దౌడు తీసింది.

అసిస్టెంటు రోగిని అడిగాడు. ''సాయంకాలం అయిదింటి వరకు, యీ కన్సల్టేషన్ రూమ్‌లో ఆ కుర్చీలోనే వుండి వెయిట్ చేసెదరా? నేను బయట తాళం వేసి పోవుచున్నాను. ఒంటి గంటవరకే నా డ్యూటీ''.

''నాకేమవసరము వెయిట్ చేయుటకు?'' అని లేచాడు రోగి. వంగి, కిందబడిన ప్రిస్క్రిప్షన్ కాగితం అందుకుని చేతికర్రతో వాకిట్లోకి వచ్చాడు.

అసిస్టెంటు తాళం బిగించి, ఎలక్ట్రిక్ మోటార్ సైకిలెక్కి తుర్రుమన్నాడు.

రోగి కళ్లార్పుతూ ప్రిస్క్రిప్షన్ మీదికి దృష్టి పోనిచ్చాడు. బిళ్ల గోచీ నలిగిందేమోనని చూచుకున్నాడు.

''కాలమే మీ రోగము కుదర్చగలదు. కాలము కొని వాడండి. మంచి ఫలితము కనబడును.'' ఫిజిషన్ చంద్రమౌళి.

రోగి దానిని చింపి కాలవలో పడేశాడు. ''రిపోర్ట్ కాగితం యేదీ? అడిగి తీసుకోటం మరిచానే. రిపోర్టేమనిచ్చాడో!'' అని విచారిస్తూ మెట్లు దిగి రోడ్డెక్కాడు రోగి.